# ఎన్నారైలు 30 లక్షల మంది ఉంటే.. మనకున్నది ఒ

05-08-2016 23:33:32



**డాలస్ (టెక్సాస్):** యుఎస్ఎలో దాదాపు 30 లక్షల మందికిపైగా భారతీయ అమెరికన్లు ఉండగా, యుఎస్ కాంగ్రెస్‌లో వీరందరి తరఫున కేవలం ఒకే ఒక్క భారతీయ అమెరికన్ ప్రతినిధి ఉన్నారని యూఎస్ కాంగ్రెస్‌కు పోటీ చేస్తున్న ప్రవాస భారతీయుడు రాజా కృష్ణమూర్తి (42) అన్నారు. హోరాహోరీగా సాగుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరులో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ప్రవాస భారతీయుడు రాజా కృష్ణమూర్తికి మద్దతుగా స్థానిక ఎన్నారైలు నిర్వహించిన ఫండ్ రైజింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెక్సాస్‌లోని కాలీవిల్‌లో ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ ప్రముఖ నేతల్లో ఒకరైన తానా పూర్వపు అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ నివాసంలో ఆగస్టు 3వ తేదీన ఈ కార్యక్రమం జరిగింది.

ఈ ఏడాది నవంబర్ 8వ తేదీన జరుగబోయే అమెరికా సాధారణ ఎన్నికల్లో ఇల్లినాయిస్ 8వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి రాజా కృష్ణమూర్తి యూఎస్ కాంగ్రెస్‌కు పోటీ చేస్తున్నారు. ఆయన్ని తోటకూర ప్రసాద్ ఈ కార్యక్రమం ద్వారా అతిథులకు పరిచయం చేశారు. అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాతో పాటు దాదాపు 100 మందికి పైగా ప్రముఖ డెమోక్రటిక్ నాయకుల మద్దతు కృష్ణమూర్తికి ఉందన్నారు. చిన్నవయసు నుంచే అమెరికా వాసిగా ఉన్న ఆయనకు సాధారణ ప్రజల కష్టనష్టాలు బాగా తెలుసని, అటువంటి వ్యక్తి యూఎస్ కాంగ్రెస్‌కు తప్పక ఎన్నికై, ఉత్తమ ప్రజాప్రతినిధిగా నిలుస్తారని ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

హోస్ట్ కమిటీ సభ్యుల్లో ఒకరైన ఎమ్వీఎల్ ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణమూర్తి వ్యక్తిగత నేపథ్యాన్ని వివరించారు. ఆయన కుటుంబం న్యూఢిల్లీ న్యూయార్క్‌కు వచ్చిందని, అప్పుడాయన కేవలం 3 నెలలు మాత్రమేనని చెప్పారు. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీర్‌గా, హార్వర్డ్ లా స్కూల్ నుంచి ఆనర్స్ పట్టా అందుకున్న రాజా కృష్ణమూర్తి విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తారని తెలిపారు.

ఈ సందర్భంగా రాజా కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ వారసత్వానికి మూలమైన క్రమశిక్షణ, నైతికత, సంప్రదాయ విలువలను తనలో పెంపొందించిన తన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి భారతీయ అమెరికన్ సామాజికవర్గం విద్య, వైద్యం,

సాంకేతిక పరిజ్ఞానం, ఇంజనీరింగ్, వాణిజ్యం, ఆధ్యాత్మికం తదితర రంగాల్లో తనదైన ముద్ర వేసినప్పటికీ, రాజకీయ భాగస్వామ్యంలో మాత్రం వెనుకబడి ఉన్నట్లు భావిస్తున్నానన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా ప్రధాన రాజకీయ స్రవంతిలోకి అడుగుపెట్టడం ద్వారా మరెన్నో సేవలందించే అవకాశం ఉందన్నారాయన. యుఎస్ఏలో 30 లక్షల మందికిపైగా భారతీయ అమెరికన్లు ఉంటే, యుఎస్ కాంగ్రెస్‌లో వీరందరి తరఫున కేవలం ఒకే ఒక్క భారతీయ అమెరికన్ ప్రతినిధి ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో తాను యుఎస్ కాంగ్రెస్‌కు ఎన్నికైతే ఈ ప్రాతినిధ్యాన్ని100 శాతానికి పెంచేందుకు బాటలు వేస్తానన్నారు. ఈ ఫండ్ రైజింగ్ కార్యక్రమానికి చేయూతనిచ్చిన డాక్టర్ తోటకూర ప్రసాద్, పాల్ పాండ్యన్, తుమ్మల శ్రీధర్, ఎమ్వీఎల్ ప్రసాద్, సిసి థియోఫైన్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.



అనంతరం హోస్ట్ కమిటీ సభ్యుల్లో ఒకరైన థియోఫైన్ స్పందిస్తూ ప్రత్యర్థులకంటే అదనంగా 1.6 మిలియన్ డాలర్ల మేర నిధులు సాధించిన కృష్ణమూర్తి విజయం తథ్యమని ఆకాంక్షించారు. అమెరికా పౌరులందరూ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారంతా కృష్ణమూర్తి కోసం తమ చికాగో స్నేహితుల మద్దతు కూడగట్టాలని విజ్ఞప్తి చేశారు.

చివరిగా కాంగ్రెస్ ఎన్నికలు, నిధుల సమీకరణ తదితర అంశాలపై అతిథులు అడిగిన ప్రశ్నలకు రాజా కృష్ణమూర్తి జవాబులిచ్చారు. తర్వాత విందుతో ఈ కార్యక్రమం ముగిసింది.